

# మాటా మంతీ

## -సాయి పద్మ



***25***

## రజతోత్సవాలూ... కొన్ని కబుర్లూ

ఈ నెలకి నా కాలమ్ మొదలెట్టి ఇరవైయిదు నెలలు. రజతోత్సవం అన్నమాట. అలా అనుకుంటే, నేను సోషల్ వర్కర్ గా వర్క్ మొదలెట్టి ఈ సంవత్సరానికి ౩౦ ఏళ్ళు దాటాయి. ఇది మాత్రం అనిపిస్తుంది, అప్పుడే ముప్పై ఏళ్ళు గడచిపోయాయా? అని. అసలు కదలలేని పరిస్థితులలో వచ్చిన ప్రతీ అవకాశం, నన్ను నేను బాధ నుండీ, దుఖం నుండీ బయట పడేసుకోవటానికి, అందులో వీలున్నంత మిగతా వాళ్లకి సహాయం చేయటానికి వాడుకున్నప్పుడు, ప్రతీ నిమిషం విలువైనదే..! నా సర్జరీ అయి, ఇంకా నేను ఐ సి యు లో ఉన్నప్పుడు డాక్టర్ మొదటిసారి ఆక్సిజన్ మాస్క్ తీసినప్పుడు, నేను అడిగిన మొదటి ప్రశ్న – ఎన్నాళ్ళల్లో మళ్ళీ నా చేతులు సరిగా పని చేస్తాయి? మళ్ళీ నేను నా ఎగ్జామ్స్ రాసుకోవచ్చా? అన్నది. నా సర్జన్ కి ఇప్పటికీ, ఇన్నేళ్ళ తర్వాత చెకప్ కి వెళ్తే కూడా గుర్తు చేస్తున్నారు – ఆరు నెలల్లో నీ పని నువ్వు చేసుకోవచ్చు అని చెప్పాను , అంతే కదా? అని. నవ్వి ఊరుకున్నా.. ఆరేళ్ళు పట్టింది నిజానికి మళ్ళీ నేను నా చేతుల్ని సక్రమంగా యూజ్ చేసేందుకు. ఇంక నడక అయితే సుమారు, ముప్పై ఏళ్ళ తర్వాత, ఇప్పుడు మళ్ళీ మూడేళ్ళ వాళ్ళు వేయాల్సిన అడుగులు వేస్తున్నాను. వొక్కోసారి అనిపిస్తుంది, ఏంటి ప్రయోజనం? ఎందుకు ఇంత కష్టపడుతున్నాను అని? మా ఫ్రెండ్ అంటుంది you have half-starved your life.. so you deserve what all that's there in comfort అని. అదంతా ఏమో తెలీదు గానీ, నాకు వూహ తెలిసిన దగ్గర నుండీ, నేను ఫిట్ గా, నన్ను నేను ఎవరి మీదా డిపెండెంట్ గా ఉండకుండా ఉండేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాను.

వోకోసారి ఎందుకిదంతా అనేందుకు సమాధానాలు,.... చాలా మంది జీవితాలు , ఆ జీవితాలని వాళ్ళు ప్లాన్ చేసుకోకుండా గడిపేసిన తీరు, వాళ్ళు అనుభవిస్తున్న అబ్యూజ్, ఇవన్నీ ఇస్తాయి. ఇప్పుడు వొకమ్మాయి ఆస్తి కేసు చూస్తున్నాను. ఆమె డిజేబుల్డ్. తల్లి, తండ్రి వొకరి తర్వాత వొకరు చనిపోయారు. ఎక్కువగా చదువుకోలేదు. ఇంట్లోంచి కదలలేదు. బ్రెయిన్ సక్రమంగా ఉంది, తెలివితేటలు ఉన్నాయి. కానీ, ఏది ఎలా చేయాలో తెలీదు. ముఖ్యంగా ఆమె ఆస్తి ఆమె ఎలా తీసుకోవాలో, తనను తాను ఎలా ఎంపవర్ చేసుకోవాలో తెలీదు. అమాయకత్వానికి తోడు, డిజేబిలిటీ ఉంటె, గ్రామాల్లో ఇంచుమించు మతిలేని వాళ్ళ కిందే చూస్తారు. నాకే ఎన్నోసార్లు అనుభవం అయింది. ఎక్కడికన్నా వెళితే, నేను ఏం తింటానో, ఇవతలి వాళ్ళని అడుగుతారు, నాకు నోరు లేనట్లు. గుడికి వెళితే, ప్రసాదం 'అమ్మాయికి పెట్టించండి ' – అంటారు. మొదట విచిత్రంగా అనిపించేది. కానీ తర్వాత అర్ధం అయింది, దీని వెనుక వాళ్ళ జాలి, అర్ధం కానితనం. వొక వీల్చైర్ లో వస్తున్నారంటే , ఇంక వాళ్లకి మతి కూడా లేదు అని అనుకుంటారు. దానికి తోడు, " మా ఇంటి లోన మహాలక్ష్మి నీవే " అంటూ బొట్టు, కాటుక పెట్టి, చీర కట్టే సినిమా మొగుళ్ళు , లేకపోతే వీల్చైర్ లో ఉన్నవాళ్ళని ఆస్తి కోసం పెళ్లి చేసుకొని చంపేసే విలన్లు ఉన్న ఈ సినిమా ప్రేరిత సమాజంలో , మన ఐడెంటిటీ , వీల్చైర్ గానీ, క్రచేస్ గానీ లేకుండా నిలబెట్టుకోవటానికి కూడా చాలా కష్టపడాలి. అందుకే చాలా మంది దాక్కుంటారు, అమ్మతనం

వెనకాల, తమ తమ డిజేబిలిటీ ని చీర/చున్నీ కొంగు వెనకాలో లేదా, మేము బయటకి రాము అనే మొహమాటం వెనకాలో నిజానికి దాక్కుంటున్నది వాళ్ళు మాత్రమే బ్రతకగలిగిన సౌందర్యం, ధైర్యం.

ఈ జీవితాల వెనకాల చాలా అందం ఉంది, చాలా ఎక్కువ తయారయి, లిప్స్టిక్ లేకుండా బయటకు రాని మా సంస్థలో అమ్మాయిని అడిగాను, రాణీ ( పేరు మార్చబడింది ) 'ఎందుకు అంత తయారవుతావు?' అంటే ఆ అమ్మాయి చెప్పిన సమాధానం... 'అక్కా, రెండు లాభాలు, ఇలా ఉన్నా , ఇంత తయారయి తిరుగుతోంది అని, ఇంట్రెస్ట్ తో చూస్తారు, పలకరిస్తారు. రెండోది, నాకు లేని విషయం గురించి, ఉదాహరణకి కాలు వంకరో, మాట సరిగ్గా రాకపోవటమో ఇలాంటి అవకరం గురించి పట్టించుకోరు' అని. పాయింటే అనిపించింది. అయినా కాకపోయినా అంత ధైర్యంగా తనను తాను ఎక్స్ప్రెస్ చేసుకోవటం నచ్చింది.

ఇరవై అయిదేళ్ళ క్రితం నేను అంత ధైర్యంగా ఉండేదాన్నా అంటే చెప్పలేను. ఈ సామాజిక సేవ, కౌన్సెలింగ్ నాకు చాలా నేర్పింది, నేర్పిస్తోంది. ఇలా అనుకుంటుంటే, ఇంకో కేస్ కౌన్సెలింగ్ చేస్తున్నాను. పెళ్ళయిన ఇరవై అయిదేళ్ళ తర్వాత, విడాకులకు అప్లై చేసాడు భర్త. తనను భార్య పట్టించుకోవటం లేదని, కనీసం వండి పెట్టి తన బాగోగులు చూసుకోవటం లేదని. భార్యకు కౌన్సెలింగ్ మొదలు పెట్టగానే – ఆమె చెప్పింది. " నాకు విడాకులు ఇస్తారా ఇవ్వరా అన్నది కాదండీ.. ఆయన పెన్షన్ లో నా భాగం , ఇంట్లో వాటా ఉంటె చాలు " – అని. ఎంత క్లారిటీ! 'మీ పిల్లలకు పెళ్ళిళ్ళు కూడా అయ్యాయి కదా!' అంటే.. "అవునండీ ఇరవై అయిదేళ్ళు అయింది అన్నది. మరి, డైవోర్స్ అంటే , సంఘం సమాజం .. అన్నాను కావాలనే .. డబ్బుంటే అవన్నీ కొనుక్కోవచ్చు మేడం , పతి లేకపోయినా పరపతి సంపాదించుకోవచ్చు .." అన్నది పొయెటిక్ గా ..

చలం చెప్పిన స్త్రీ స్వేచ్ఛ కొంతవరకూ వచ్చినట్టే ఉంది. బాధితుల న్యాయం వాళ్ళే చేసుకుంటున్నారు. కొన్ని రజతోత్సవాలు ఇలా కూడా ఉంటాయి

మళ్ళీ కలుద్దాం , మరో విషయంతో

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments